
సాక్షి
బాపట్ల
మంగళవారం । 21 । మార్చి । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 534.90 అడుగుల వద్ద ఉంది. ఇది 177.8698 టీఎంసీలకు సమానంగా ఉంది.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 44.2300 టీఎంసీలు ఉంది. ప్రాజెక్టు ఎగువ నుంచి 200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కోవిడ్ జీరో

గుంటూరుమెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం ఒక్క కరోనా పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. జిల్లాలో కరోనా మరణాలు ఎక్కడా సంభవించలేదు.



న్యూస్‌రీల్

పరమపదనాథుని అలంకారంలో నారసింహుడు



మంగళగిరి: నగరంలోని లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి పరమపదనాథుడు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకోగా ఉత్సవాన్ని ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవానికి కైంకర్యపరులుగా ఆత్మకూరుకు చెందిన మురికిపూడి మాధవరావు, ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరికి చెందిన లంకా కృష్ణమూర్తిలు వ్యవహరించారు.

1,10,687 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,27,477 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,10,687 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 90,378 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

దుర్గమ్మకు బంగారు బొట్టు, నత్తు, బులాకీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దంపతులు బంగారు బొట్టు, నత్తు, బులాకీని సోమవారం సమర్పించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మంత్రి వెంట మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆలయానికి విచ్చేశారు. మంత్రి నాగేశ్వరరావు దంపతులు 18 గ్రాముల బంగారంతో తయారు చేయించిన బొట్టు, నత్తు, బులాకీలను చైర్మన్‌కు అందచేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వదించగా, చైర్మన్ అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలను మంత్రికి అందజేశారు.

ఇంద్రకీలాద్రిపై చురుగ్గా ఉగాది ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఉగాది పర్వదినానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. వసంత నవరాత్రోత్సవాలు పురస్కరించుకుని అమ్మవారికి తొమ్మిది రోజులు నిర్వహించే విశేష పుష్పార్చనకు లక్ష్మీ గణపతి ప్రాంగణంలోని యాగశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. రాజగోపురం ఎదుట కళావేదికపై పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ఆలయానికి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉగాది రోజు అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు గుడి ప్రాంగణంలో పుష్పాలతో అలంకరించాలని ఆలయ సిబ్బందిని అధికారులు ఆదేశించారు. పండుగ రోజు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఉత్సవమూర్తులను వెండి రథంపై ఊరేగించనున్నారు. ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఈవో భ్రమరాంబ, దేవస్థాన ఫెస్టివల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఉత్సవాలకు మరో రోజు మాత్రమే ఉండటంతో ఆలయ అధికారులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఇంటర్ విద్యార్థి డీబార్

కారెంపూడి: ఇంటర్మీడియెట్ పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థిని డీబార్ చేసిన సంఘటన సోమవారం జరిగింది. వివరాల ప్రకారం.. స్థానిక ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం సివిక్స్ పరీక్ష చివరి పదినిమిషాల ముందు ఓ విద్యార్థి కాపీయింగ్‌కు పాల్పడుతున్న వైనాన్ని సీసీ కెమెరాలో పరీక్ష కేంద్రం డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ గమనించారు. పరీక్ష హాల్‌కు వెళ్లి విద్యార్థిని పరిశీలించగా జవాబుల స్లిప్‌లు దొరికాయి. దీంతో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి డీబార్ చేశారు. అంతకు ముందు పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేసింది.

ఇక డ్రోన్ సాయం!

అన్నదాతలకు కిసాన్ డ్రోన్లు

- మండలానికి మూడు డ్రోన్లు చొప్పున ఐదుగురు రైతుల సంఘానికి ఇవ్వనున్న ప్రభుత్వం
- ఒక్కో డ్రోన్ ఖరీదు రూ.10 లక్షలు
- రూ. 5 లక్షల బ్యాంక్ రుణం
- రూ. 4 లక్షలు ప్రభుత్వ సబ్సిడీ
- రూ. లక్ష రైతుల భాగస్వామ్యం
- డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీ సులభం



పంటలకు మందు పిచికారీ చేస్తున్న డ్రోన్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అన్నదాతల సంక్షేమం... అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని పథకాల ద్వారా వారికి వెన్నుదన్నుగా నిలుస్తుంది. ఇప్పటికే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్రపరికరాలతో సహా అన్ని రకాలుగా లబ్ధి చేకూరుస్తున్న ప్రభుత్వం సాంకేతికతను మరింతగారైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తుంది. ఇప్పటికే వ్యవసాయానికి అనుగుణంగా పలు యంత్ర పరికరాలను ప్రవేశపెట్టింది. తాజాగా పంటలకు డ్రోన్ టెక్నాలజీతో మందుల పిచికారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు అవసరమైన డ్రోన్లను రైతులకు అందుబాటులోకి తెస్తుంది. ఏకంగా రైతులకు డ్రోన్లను అప్పగిస్తుంది. దీని ద్వారా రైతులు తమ పంట పొలాలకు పురుగుమందులను పిచికారీ చేసుకోవచ్చు.

రైతులకు కిసాన్ డ్రోన్లు..

కిసాన్ డ్రోన్ల పేరుతో ప్రభుత్వం రైతులకోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా వ్యవసాయ దారులకు డ్రోన్లను మంజూరు చేయనున్నారు. ఐదుగురు రైతులు సభ్యులుగా కమిటీ ఏర్పాడాల్సి ఉంది. ఈ కమిటీకి రూ. 10 లక్షల విలువచేసే డ్రోన్లను మంజూరు చేయనున్నారు. రూ. 4లక్షలు ప్రభుత్వం సబ్సిడీ కింద రైతుల గ్రూపు ఖాతాలో జమచేస్తుంది. రూ. 5 లక్షలను ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా రుణం ఇప్పిస్తుంది. రైతుల గ్రూపు తమ వాటాగా రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుంది. మండలానికి మూడు డ్రోన్ల చొప్పున మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఒక్కో మండలం నుంచి మూడు రైతుల గ్రూపులు డ్రోన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా వ్యవసాయశాఖ కిసాన్ డ్రోన్ పథకాన్ని పర్యవేక్షిస్తుంది. ఐదుగురు సభ్యులలో ఒకరు తప్పనిసరిగా ఇంటర్ కలిగి ఉండాలి. పాస్‌పోర్టు తప్పనిసరిగా ఉండాలి. సదరు సభ్యుడికి డ్రోన్ నడిపే విధానంపై గుంటూరు లాంఫామ్‌లో శిక్షణ ఇస్తారు. తర్వాత డ్రోన్ మంజూరు చేస్తారు. రైతులతో కూడిన ఐదుగురు సభ్యులు డ్రోన్ నిర్వహణను పర్యవేక్షిస్తారు. అవసరమైన రైతులు తగిన సమయంలో డ్రోన్ ద్వారా పురుగుమందును పిచికారీ చేయించుకొని నిర్వాహకులకు బాడుగ చెల్లించాల్సి ఉంటుంది. మనుష్యులు స్ప్రేయర్లతో పిచికారీ చేయటం కంటే డ్రోన్ ద్వారా మందును పిచికారీ చేయటం వలన పంటలకు ఉపయోగంగా ఉంటుంది. పురుగుమందులు పంటలకు పూర్తిస్థాయిలో అందుతాయి. తద్వారా తెగుళ్ల నివారణ సులభమవుతుంది. కూలి ఖర్చులు ఆదా అవుతాయి. డ్రోన్‌తో మందు పిచికారీ వలన పంటలకు మంచిది.

కిసాన్ డ్రోన్లతో శ్రమ, ఖర్చు తక్కువ



రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కిసాన్ డ్రోన్లను మంజూరు చేస్తుంది. తొలుత మండలానికి మూడు డ్రోన్లు మంజూరు చేస్తుంది. ఇందు కోసం రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడంతోపాటు బ్యాంకు రుణం కూడా ఇప్పిస్తుంది. డ్రోన్ ద్వారా తక్కువ శ్రమ, ఖర్చుతో మందులను పిచికారీ చెయ్యొచ్చు.

– షేక్ అబ్దుల్ సత్తార్, జిల్లా వ్యవసాయాధికారి

స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ విజయకష్ణన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల అర్బన్: జిల్లా యంత్రాంగం ప్రాధాన్యత పనులు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ స్పందన అర్జీలు, జగనన్నకు చెబుదాం అర్జీలను గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జిల్లా అధికారులు ప్రతి గురువారం సచివాలయాలను తప్పకుండా సందర్శించాలన్నారు. జిల్లాలో విద్యా హక్కు చట్టం కింద ఉచిత విద్యను అందించడానికి ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మిశివ జ్యోతి, మత్స్య శాఖ జేడీ సురేష్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్, పౌర సరఫరాల శాఖ డీఎస్ఓ విలీమ్స్, డీఎం శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కౌలు భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు..

నేను భోగి రెడ్డి పిచ్చిరెడ్డి అనే వ్యక్తికి వెదుళ్ళపల్లి తులసినగర్‌లో నాకున్న 2.25 ఎకరాల భూమిని కౌలుకు ఇచ్చాను. అయితే నాకు తెలీకుండా ఆ భూమిని తనపేరుతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. విచారించి, న్యాయం చేయండి.

– భీమా ముత్యాలు, తులసీనగర్

కొడుకు బారినుంచి కాపాడండి..



నా కుమారుడు ఆస్తి తన పేర రాయాలంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. భోజనం కూడా పెట్టడం లేదు. నా సమస్యను పరిష్కరించండి.

– వల్లంరెడ్డి బ్రహ్మారెడ్డి, వెంకటాపురం, అద్దంకి మండలం

ఆరోగ్యం బాగోలేదు.. దయ చూపండి



నేను క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాను. వైద్యం చేయించుకోవానికి ఆర్థిక పరిస్థితి బాగోలేదు. నాకు పెన్షన్ ఇప్పించి, ఆదుకోండి.

– వడ్లమూడి సుబ్బాయమ్మ, జాగర్లమూడి, జె.పంగులూరు మండలం

నేడు ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్ మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు గుజ్జనగుండ్ల సెంటర్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మెక్ డోనాల్డ్స్, డీ–మార్ట్, యాక్సిస్ బ్యాంకులో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఏర్పాటు చేస్తున్న జాబ్‌మేళాకు టెన్త్ ఆపై విద్యార్హతలు గల నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావాలని సూచించారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతలు, ఆధార్ జిరాక్స్ కాపీలతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో సాయంత్రం 4.00 వరకు జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు తమ ప్రతినిధి పి.మణిదీప్‌ను 8074607278 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

అంతరాష్ట్ర గంజాయి సరఫరా ముఠా అరెస్ట్

- 140 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందాల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: గంజాయి సరఫరా చేస్తూ రూ.లక్షలు గడించే అంతరాష్ట్ర గంజాయి సరఫరా ముఠాను బాపట్ల జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్‌జిందాల్ వెల్లడించారు. రంపచోడవరం ప్రాంతానికి చెందిన బుజ్జి ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దులలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి తన అనుచరుల ద్వారా పెద్ద మొత్తంలో గంజాయి సప్లయి చేయించుకొని, తన ఏజెంట్‌ల ద్వారా పలు ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తూ అక్రమ సంపాదనకు అలవాటు పడ్డాడు. బుజ్జి తనకు సహకరించేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా, కొయ్యూరు మండలం, వెలగలపాలెం గ్రామానికి చెందిన గంజాయి కేసుల్లో పాత నేరస్తుడైన వేమలపూడి గవాస్కర్ అలియాస్ తేజను నియమించుకున్నాడు. బుజ్జి ఆదేశాల ప్రకారం గవాస్కర్ అల్లూరి సీతారామరాజు జిల్లా, కొయ్యూరు మండలం, కొండసంత గ్రామానికి చెందిన కర్రి దారబాబు, నర్సీపట్నంలోని అయ్యన్నపాలెం ఏరియాలో కామన్ సర్వీస్ సెంటరు నడిపే లగిజే ఈశ్వర వరప్రసాద్‌ను ఈనెల 18న వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఏరియాకు దగ్గర్లోని అడవుల్లో కలిసి చెన్నై తరలించాల్సిందిగా రూ.30వేలు ఇచ్చి, గంజాయి బస్తాలను అప్పగించాడు. గవాస్కర్, కర్రిదారబాబు, ఈశ్వర ప్రసాద్, గంజాయి తీసుకుని బాడుగ కారులో చెన్నై బయల్దేరారు. ఈనెల 19న మధ్యాహ్నం 3 గంటల సమయంలో మార్టూరు సీఐ షేక్.టి.ఫిరోజ్, మార్టూరు ఎస్ఐ కమలాకర్ వారి సిబ్బంది కలసి మార్టూరు ఇంచార్జి తహసీల్దార్ బి.వెంకటరెడ్డి సమక్షంలో బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులు తనిఖీలు చేయడం చూచి, తమ కారుని వెనుకకు మళ్లించుకొని పారిపోయేందుకు యత్నించారు. సీఐ వారి సిబ్బంది చాకచక్యంగా నిందితులను పట్టుకొని వారిని క్షుణ్ణంగా విచారించి కారులో అక్రమంగా తరలిస్తున్న 4 తెల్లని ప్లాస్టిక్ గోతాల్లో 140 కిలోల గంజాయిని, అక్రమ రవాణాకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు.

మార్టూరు పోలీసులకు ఎస్పీ ప్రశంసలు...



సీఐ ఫిరోజ్‌ను అభినందిస్తూ ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ

మార్టూరు: గంజాయి అక్రమ రవాణలో నిందితులను చాకచక్యంగా పట్టుకున్న మార్టూరు పోలీసులను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. ఎస్పీ సోమవారం బాపట్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్థానిక అధికారులను అభినందిస్తూ ప్రశంసపత్రాలు అందజేశారు. మార్టూరు సీఐ ఎస్‌కేటీ ఫిరోజ్, ఎస్ఐ కమలాకర్, ఏఎస్ఐ సైదా, హెడ్ కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, ప్రసాద్, రాజేష్‌లను అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందించగా స్థానికులు సైతం అధికారులను అభినందించడం విశేషం.

వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం

- ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది
- హెచ్3 ఎన్2 వైరస్ కేసులను గుర్తించే పనిలో వైద్య సిబ్బంది
- గుంటూరు వైద్య కళాశాలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- జ్వరాలపై అవగాహన, అప్రమత్తత అవసరం

గుంటూరు మెడికల్: కోవిడ్ కేసులు తగ్గుముఖం పడుతున్నాయని సంతోష పడుతున్న తరుణంలో నూతనంగా హెచ్3 ఎన్2 వైరస్ కేసులు కొద్దిరోజులుగా దేశ వ్యాప్తంగా నమోదవుతున్నాయి. ఈనేపథ్యంలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ పలు రాష్ట్రాలను అలర్ట్ చేసింది. ముఖ్యంగా నూతన వైరస్ కేసులు నమోదవుతున్న రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని, వైరస్ సోకకుండా తగు నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఏపీలో కేంద్ర నివేదిక ప్రకారం నూతన వైరస్ కేసులు నమోదు కాలేదు. అయినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తుగా వైరస్ బారిన పడకుండా ప్రజలను కాపాడాలనే ఉద్దేశంతో వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఈనెల 13 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభించారు.

6,36,465 ఇళ్ల సర్వే పూర్తి..

జిల్లాలో నూతన వైరస్ బారిన పడకుండా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేస్తూ ఇంటింటికి తిరిగి వివరాలు నమోదు చేస్తున్నారు. జ్వరం అనుమానిత లక్షణాలు ఉంటే తక్షణమే వారికి చికిత్స అందిస్తున్నారు. ముఖ్యంగా జ్వరం, దగ్గు, జలుబు తదితర లక్షణాలు ఉన్నవారికి వ్యాధి నియంత్రణ కోసం తక్షణమే మందులు అందిస్తున్నారు. జిల్లాలో 7,14,045 ఇళ్లు ఉన్నాయి. వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఆశ, ఏఎన్ఎంలతోపాటు, వార్డు వలంటీర్లు వారం రోజుల వ్యవధిలో 6,36,465 ఇళ్లు సర్వే చేశారు. సర్వేలో భాగంగా జ్వరం, ఇతర లక్షణాలతో 850 మంది బాధపడుతున్నట్లు గుర్తించి, వారికి తక్షణ వైద్య సహాయం అందించారు. ఇంటింటి సర్వేలో రాష్ట్రంలో గుంటూరు జిల్లా 90.48 శాతంతో ఐదో స్థానంలో ఉంది.

ప్రక్షాళన దిశగా డీఎంహెచ్ఓ కార్యాలయం

- గత డీఎంహెచ్ఓను ప్రభుత్వానికి సరెండర్ చేసిన కలెక్టర్
- తాజాగా మరికొంత మంది సిబ్బందిపై చర్యలకు రంగం సిద్ధం



సాక్షి ప్రతినిధి, గుంటూరు: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ పనితీరుపై పలు ఆరోపణలు రావడంతో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కార్యాలయ పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించారు. స్పందన కార్యక్రమానికి పలుమార్లు గైర్హాజరవడం, ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, సక్రమంగా నివేదికలు అందించకపోవడం, గత డీఎంహెచ్ఓపై అనేక ఆరోపణలు రావడంతో తక్షణమే ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో దృష్టి సారించి అన్ని సదుపాయాలు కల్పిస్తున్న సంగతి తెలిసిందే. జిల్లా ఆసుపత్రులను అభివృద్ధి చేయడంతో పాటు వైఎస్సార్ అర్బన్, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్నారు. శాఖలో అన్ని పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తూ వస్తున్నారు. ఈ సమయంలో కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వైద్య ఆరోగ్య శాఖకు చెడ్డపేరు వస్తుండటంపై జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి సీరియస్ అయ్యారు. ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పలు నిధులకు సంబంధించిన ఫైల్స్, రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన ఫైల్స్ మాయమైనట్లు ఆరోపణలు వచ్చాయి. కార్యాలయ ఉద్యోగులు సైతం వాటిని సకాలంలో వెతికి కలెక్టర్ కార్యాలయానికి పంపించలేదు. అంతేకాకుండా పలు ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా కోవిడ్ బిల్స్ ప్రభుత్వం విడుదల చేసి ఏడాది కావస్తున్నా వాటిని కార్యాలయ ఉద్యోగులు, అధికారులు కోవిడ్ కాలంలో పనిచేసిన వైద్యులు, వైద్య సిబ్బంది ఖాతాల్లో జమ చేయలేదు. దీనిపై పలు మార్లు కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదులు రావడంతో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై చర్యలకు కలెక్టర్ రంగం సిద్ధం చేశారు. ముఖ్యంగా కోవిడ్ బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, ఉద్యోగులను సరెండర్ చేసేందుకు కలెక్టర్ రంగం సిద్ధం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు సంబంధిత ఫైళ్లను కలెక్టర్ కార్యాలయానికి పంపించారు. కార్యాలయం పరిపాలన అధికారి, ఆఫీస్ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్‌లపై చర్యలకు రంగం సిద్ధమైంది.

పోషకాహార లోపాన్ని నివారించాలి: జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: చిన్నారులు, గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నివారించాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జెడ్పీ క్యాంపు కార్యాలయంలో పోషణ్ పక్వాడా–2023 పక్షోత్సవాలను ఆమె ప్రారంభించారు. హెనీక్రిస్టినా మాట్లాడుతూ పక్షోత్సవాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఉద్యోగినులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రోబాల్‌లో మెరిసిన వెదుళ్లపల్లి రత్నాలు

- జాతీయ జట్టులో ఇద్దరు క్రీడాకారులు
- అంతర్జాతీయ పోటీల్లో భారత్ మూడో స్థానం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



త్రోబాల్ పోటీల్లో భారత్ జట్టుతో కోటా రాజేష్, ఉమామహేశ్వరరావు

బాపట్ల అర్బన్: పల్లె సీమల్లో క్రీడా రత్నాలు అంతర్జాతీయ వేదికపై మెరిశారు. కష్టాల అవరోధాలను విసిరేసి విజయపు లక్ష్యాన్ని చేరుకున్నారు. బంగ్లాదేశ్ వేదికగా నిర్వహించిన అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో భారత్ జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఈ జట్టుకు బాపట్ల జిల్లా బాపట్ల మండలం వెదుళ్లపల్లి గ్రామానికి చెందిన కోట రాజేష్, బండారు ఉమామహేశ్వరరావు ప్రాతినిధ్యం వహించారు. మొదటి నుంచీ క్రీడలపై ఆసక్తి కనబరిచే ఈ ఇద్దరు క్రీడాకారులు వివిధ క్రీడా విభాగాల్లో సత్తా చాటారు. అంతర్జాతీయ వేదికగా ప్రతిభ కనబరిచిన వీరిద్దరినీ గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

వలంటీర్‌గా సేవ చేస్తూ..

కోట రాజేష్ పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ, వార్డు సచివాలయాల్లో వలంటీర్‌గా పని చేస్తున్నాడు. క్రీడల్లోనూ ప్రాక్టీస్ కొనసాగించాడు. త్రోబాల్‌తో పాటు వాలీబాల్, టెన్నిస్, హ్యాండ్ బాల్, కబడ్డీ, పోల్ వాల్ట్, జావెలిన్ త్రో, లాంగ్ జంప్, హైజంప్‌లో ప్రతిభ చూపేవాడు. రాజేష్‌లోని ప్రతిభను గుర్తించిన కోచ్ అంకమ్మ తన ఆటకు మరింత పదును పెట్టారు. ఇక రత్నానికి మెరుగులు పెట్టినట్టు.. రాజేష్ తాను పాల్గొన్న అన్ని క్రీడల్లోనూ సత్తా చాటారు.

క్రీడలపై మక్కువతో..

ఉమామహేశ్వరరావు కూడా చిన్నతనం నుంచి క్రీడలపై మక్కువ చూపేవాడు. వాలీబాల్, త్రోబాల్ ఆటల్లో ఉత్తమ ప్రతిభ చూపేవాడు. అనేక పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు సాధించాడు. వివిధ పాఠశాలల్లో పీఈటీగానూ పని చేశాడు. త్రోబాల్ ఎంపికల్లో భారత్ జట్టుకు ఎంపికై బంగ్లాదేశ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు.



జాతీయ జెండాతో కోటా రాజేష్, ఉమామహేశ్వరరావు

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్‌జిందాల్



దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి వస్తువులు

- రూ.18.50 లక్షల విలువైన వస్తువులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: రెప్పపాటులోనే దొంగతనాలు చేసి జల్సా జీవితాన్ని గడిపే ఘరానా దొంగల ముఠాను బాపట్ల పట్టణ పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుంటూరు జైలు లో పరిచయమైన శొంఠి దుర్గారావు, పులి రమేష్ ఇద్దరు జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతున్నారు. పగలు తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, అక్కడ చుట్టు పక్కల కూడా రెండు మూడు సార్లు రెక్కీ చేసి, ఆ రాత్రి ఇంటికి వెళ్లి మెయిన్ డోర్ తలుపులను వారి వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్లతో పగులగొట్టి ఇంటి లోపలకు ప్రవేశించి దొంగతనానికి పాల్పడటం వీరి నైజం. పలు చోట్ల చోరీలపై ఫిర్యాదులు రావడంతో జిల్లా క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఎం.మురళీకృష్ణ, డీఎస్పీ వి.శ్రీనివాసరావు, సీఐలు పి. కృష్ణయ్య ఆధ్వర్యంలో మూడు బృందాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలీసు బృందాలు వీరి కదలికపై ఆరా తీసి సోమవారం సాయంత్రం బాపట్ల పట్టణ శివారులో అరెస్ట్ చేశారు. నేరస్తులను విచారించగా ఈనెల 8న బాపట్ల పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారం, ఓల్డ్ పోస్టాఫీసు రోడ్డులోని ఒక ఇంటిలో, హనుమంతరావు కాలనీలోని మరో ఇంట్లో, 5వ తేదీ అర్ధరాత్రి చీరాల 2టౌన్ పరిధిలోని కొత్తపేటలోని ఇంటిలో, మార్చి 1న ఏలూరులోని సత్రంపాడు, ఎంఆర్‌సీ కాలనీలోని ఇంటిలో దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి రూ.18.50 లక్షల విలువ చేసే 322 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక కిలో 350 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కేసు దర్యాప్తులో ఉత్తమ ప్రతిభ కనపరిచిన బాపట్ల సీఐ పి.కృష్ణయ్య, సీసీఎస్ సీఐ ఎం.మురళీకృష్ణ, పట్టణ ఎస్ఐ షేక్ రఫీ, ఏఎస్ఐ కె.ధనుంజయరావు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

28, 29 తేదీల్లో ఢిల్లీలో ఆందోళనలు

నెహ్రూనగర్(గుంటూరు): జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టాలని, చట్ట సభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, జనాభా దామాషా ప్రకారం బీసీల రిజర్వేషన్లను పెంచాలనే ప్రధాన డిమాండ్లతో ఈ నెల 28, 29వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలియజేశారు. సోమవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల కులగణన చేపడతామని మాట ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం హామీని విస్మరించిందన్నారు. తొమ్మిదేళ్లుగా బీసీల సంక్షేమం కోసం కేంద్రం చేసింది శూన్యమన్నారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ఎన్నో ఏళ్లుగా దేశవ్యాప్తంగా ఉద్యమిస్తున్నప్పటికీ కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. సంఘ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడారు. సమావేశంలో సంఘ నాయకులు నిమ్మల శేషయ్య, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కొల్లికొండ వెంకటసుబ్రహ్మణ్యం, ముప్పాన వెంకటేశ్వర్లు, ద్వారకా శ్రీను, వెంకట్రావు, కుమార్ పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలి

డీఈఓ రామారావు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఈఓ రామారావు, అధికారులు

బాపట్ల అర్బన్: విద్యార్థి దశ నుంచే సాంకేతిక నైపుణ్యత పెంపొందించుకోవాలని విద్యాశాఖ జిల్లా అధికారి పీవీ రామారావు సూచించారు. ఎస్సీఆర్టీ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం అక్షరాస్యత, 21వ శతాబ్దపు స్కిల్స్‌పై అవగాహన కార్యక్రమం ఏబీఎం పాఠశాలలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో తొమ్మిదో తరగతి బోధిస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా మొత్తం 445 ప్రాజెక్టులు, 114 పాఠశాలల నుంచి వచ్చాయన్నారు. పది ప్రాజెక్టులు మాత్రమే జిల్లా స్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. పది ప్రాజెక్టులలో రెండు ప్రాజెక్టులు జెడ్పీహెచ్ఎస్ మేదరమెట్ల, జెడ్పీహెచ్ఎస్ పెరలి పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఎస్ఓ సాదిక్, జిల్లా మేనేజర్ రమణకుమారి పాల్గొన్నారు.

అసెంబ్లీలో టీడీపీ అరాచకం సరికాదు

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి



సాక్షి ప్రతినిధి, బాపట్ల: తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు సభా, సంప్రదాయాలను తుంగలో తొక్కి సోమవారం సభలో వ్యవహరించిన తీరు సరికాదని, ప్రభుత్వ మార్కెటింగ్, సహకార శాఖ సలహాదారుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. అసెంబ్లీలో టీడీపీ సభ్యుల వ్యవహార శైలిని ఆయన తప్పుబట్టారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా టీడీపీ ఎమ్మెల్యేలు అనైతికంగా వ్యవహరించారని విమర్శించారు. దేవాలయం లాంటి శాసనసభలో రౌడీయిజం సరికాదన్నారు. స్పీకర్‌ను అగౌరవ పరిచే విధంగా టీడీపీ సభ్యుల వ్యవహారశైలి ఉందని బత్తుల విమర్శించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా టీడీపీ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బత్తుల బ్రహ్మానందరెడ్డి కోరారు.

కేవీలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి అర్బన్: తెనాలి చినరావూరులోని కేంద్రియ విద్యాలయంలో తాత్కాలిక ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీలో హిందీ, ఇంగ్లిషు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయాలజీ, టీజీటీలో హిందీ, ఇంగ్లిషు, సంస్కృతం, సోషల్ సైన్స్, మ్యాథ్స్, పీఆర్పీ, స్టాఫ్ నర్సు, కోచ్ ఫర్ స్పోర్ట్స్, కౌన్సిలర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 24వ తేదీ ఉదయం 9 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. సర్టిఫికెట్లతో పాటు దరఖాస్తు, బయోడేటా ఫారాలు తీసుకురావాలని తెలిపారు. వివరాలకు https://tenali.kvs.ac.in లో సంప్రదించాలన్నారు.

దివ్యాంగులకు వాహనాలు అందించాలి

స్పందనలో కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న చల్లా రామయ్య

బాపట్ల అర్బన్: దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ వాహనాలను పంపిణీ చేయాలని కోరుతూ జిల్లా వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చల్లా రామయ్య కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేశాడు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో అర్జీ అందించారు. అనంతరం చల్లా రామయ్య విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలో అర్హులైన దివ్యాంగులందరికీ మూడు చక్రాల మోటార్ వాహనాలను ఉచితంగా అందించాలని కోరినట్లు చెప్పారు. దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. జిల్లాలో ఎంపికైనా 60 మంది దివ్యాంగులకు బాపట్ల విచ్చేసి ఉన్న మూడు చక్రాల మోటార్ వాహనాలను వెంటనే పంపిణీ చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ దివ్యాంగుల నాయకులు గుంజి ఏడుకొండలు, బొడ్డు శ్రీను, సుంకర శ్రీనివాసరావు, కొండమ్మ, బాలాజీ ఉన్నారు.

గంజాయి ప్యాకెట్లు స్వాధీనం



గంజాయిని చూపుతున్న సీఐ సోమశేఖర్

చీరాల: నలుగురు వ్యక్తుల నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో ఆపరేషన్ సంకల్పంలో భాగంగా చీరాల డీఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో టూటౌన్ సీఐ సోమశేఖర్ శివారు ప్రాంతాల్లో సోమవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నలుగురు వ్యక్తులు 680 గ్రాముల గంజాయిని చిన్నప్యాకెట్ల రూపంలో అమ్మకాలు చేస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సీఐ మాట్లాడుతూ చీరాల టూటౌన్ స్టేషన్ పరిధిలో ఎక్కడా గంజాయి అమ్మకాలు లేకుండా నిరంతరం తనిఖీలు చేస్తున్నామన్నారు. గంజాయి సరఫరా, అమ్మకాలు చేస్తే చట్ట ప్రకారం కఠిన శిక్షలు తప్పవని సీఐ హెచ్చరించారు. నలుగురిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.

ఉత్పత్తి రంగాల అభివృద్ధికి కృషి

డీఆర్ఓ లక్ష్మీశివజ్యోతి

బాపట్ల: ఉత్పత్తి రంగాల అభివృద్ధికి అధికారులంతా సమన్వయంతో కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. లక్ష్మీశివజ్యోతి తెలిపారు. జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో నిర్వహించారు. బాపట్ల జిల్లా ఆర్థికాభివృద్ధి వైపు పరుగులు తీసేలా బ్యాంకర్లు ఆర్థిక చేయూత నందించాలని డీఆర్ఓ చెప్పారు. బాపట్ల జిల్లా వ్యవసాయ రంగంపై ఆధారపడిన నేపథ్యంలో వ్యవసాయ ఆధారిత కంపెనీల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఔత్సాహికులకు ఆర్థిక చేయూతనివ్వాలన్నారు. తద్వారా జిల్లాలోకి పరిశ్రమలు వస్తాయని వివరించారు. ముఖ్యంగా జిల్లాలో పండిస్తున్న పంటలు నిల్వ చేసుకోవడానికి అవసరమైన గోదాములు, శీతల గిడ్డంగుల నిర్మాణానికి కృషి చేయాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాలలోని పొదుపు మహిళల జీవనోపాధి వృద్ధికి తోడ్పాటునివ్వాలని పేర్కొన్నారు. రైతులకు అధిక రుణాలు మంజూరు చేసి పంట ఉత్పత్తులకు సహకరించాలని కోరారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు బ్యాంకర్లు సహకరించాలని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో రూ.1592.20 కోట్ల నిధులు వెచ్చించాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు కేవలం రూ.645.59 కోట్లు వెచ్చించారన్నారు. ప్రాధాన్య రంగాల వృద్ధిలో 76.71 శాతానికి చేరుకున్నారని వివరించారు. వ్యవసాయ రంగానికి ఇప్పటి వరకు 62.81 శాతం రుణ సదుపాయం కల్పించామన్నారు. బాపట్ల జిల్లాలో అధికంగా పంటలు పండుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం లేదన్నారు. నిత్యం భూమిని నమ్ముకుని కష్టపడే రైతులకు ఆర్థిక చేయూత నివ్వాలని ఆమె పలు సూచనలు చేశారు. చిన్న తరహా పరిశ్రమలకు కేవలం 4.30 శాతం నిధుల మంజూరుపై డీఆర్ఓ అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎల్‌డీఎం పి.కృష్ణానాయక్, జయజీవన్, నాబార్డ్ ఏజీఎం కె.ఆర్.డి.కార్తీక్ పాల్గొన్నారు.

తండ్రి హత్యకేసులో కుమారుడికి జీవిత ఖైదు

మార్టూరు: వ్యసనాలకు లోనై అడిగినంత డబ్బు ఇవ్వలేదనే కారణంతో కన్న తండ్రిని హత్య చేసిన కుమారుడికి కోర్టు జీవిత ఖైదు, జరిమానా విధించింది. సోమవారం మార్టూరు సీఐ ఎస్‌కే టీ ఫిరోజ్ తెలిపిన వివరాల మేరకు.. బొబ్బేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన బత్తుల పరశురామారావు (71) పోలీసుశాఖలో ఏఎస్ఐగా పనిచేసి రిటైర్డై ఇంటి దగ్గరే ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు సంతానం. వారిలో చివరి వాడైన బత్తుల సురేష్‌బాబు వ్యసనాలకు బానిసై జులాయిగా తిరుగుతూ తండ్రికి వచ్చే పెన్షన్ డబ్బు వాడుకుంటూ ఉండేవాడు. ఈ క్రమంలో 2020 జూన్ 13న ఉదయం 6.30 గంటలకు సురేష్‌బాబు తనకు రూ.30 వేలు నగదు కావాలని అడుగగా అందుకు తండ్రి నిరాకరించాడు. ఆగ్రహించిన సురేష్‌బాబు అందుబాటులో ఉన్న జామాయిల్ కర్రతో తండ్రిపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. దాడిలో పరశురామారావు అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి ఇంకొల్లు సీఐ ఆర్ రాంబాబు ఆదేశాలతో ఏఎస్ఐ వెంకటేశ్వరరావు సురేష్‌బాబును అదుపులోనికి తీసుకొని కేసు నమోదు చేశారు. ఒంగోలు ఏడో అదనపు అదనపు జ్యూడిషియల్ కోర్టులో రెండేళ్లకు పైగా వాదప్రతివాదనలు పూర్తయ్యాక న్యాయమూర్తి డీ అమ్మనరాజు సాక్ష్యాధారాలను పరిశీలించి ముద్దాయి సురేష్‌బాబును దోషిగా నిర్ణయించి సోమవారం అతనికి జీవిత ఖైదుతో పాటు రూ 2 వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. కేసును త్వరితగతిన దర్యాప్తు చేసి ముద్దాయికి శిక్ష పడేలా చేసిన పోలీసు అధికారులను బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

పారిశ్రామికవాడగా అభివృద్ధి చేయాలి

జేసీ డాక్టర్ కె.శ్రీనివాసులు



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ కె.శ్రీనివాసులు

బాపట్ల: పారిశ్రామికవాడగా బాపట్ల జిల్లాను మార్చడానికి అధికారులు కృషి చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు కోరారు. పరిశ్రమల అభివృద్ధిపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం స్థానిక జె.సి. చాంబర్‌లో సోమవారం నిర్వహించారు. పలు కీలక అంశాలపై కమిటీ చర్చించింది. చీరాల ఆటోనగర్‌లో 10 సూక్ష్మ పరిశ్రమల స్థాపనకు జిల్లా స్థాయి కమిటీ ఆమోద ముద్ర వేసింది. ఒక పరిశ్రమను తిరస్కరించగా, మరో పరిశ్రమ ఏర్పాటుకు సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక లేకపోవడంతో వాయిదా వేసింది. సింగిల్ డెస్క్ పోర్టల్లో వచ్చిన 230 దరఖాస్తులను పరిశీలించి 218 యూనిట్ల స్థాపనకు అధికారికంగా మంజూరు చేసినట్లు ప్రకటించింది. అద్దంకి పట్టణంలో రూ.11 కోట్లతో మెటల్ డోర్స్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసే అంశంపై జిల్లా సంయుక్త కలెక్టర్ చర్చించారు. కల్కి ఫ్యాబ్రికేషన్ క్లస్టర్ అసోసియేషన్ ప్రతిపాదనలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కేంద్రం ఏర్పాటైతే బాపట్ల జిల్లాలోనే మెటల్ డోర్స్ తయారవుతాయని వివరించారు. వేమూరు మండలం జంపనిలో భారత్ టెక్స్ టైల్స్ క్లస్టర్ అసోసియేషన్ ద్వారా రూ.10 కోట్లతో అరిటి బోదెలు, పట్టుపురుగుల వ్యర్థాలతో వస్త్రాల తయారీ కేంద్రం ఏర్పాటుపై చర్చించారు. సంబంధిత ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయడానికి భూమి కేటాయింపులు ప్రతిపాదనలను పరిశీలించారు. బాపట్ల జిల్లాలో కాలుష్యం లేని కంపెనీల ఏర్పాటు కోసం రూ.15 కోట్లతో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ భవన నిర్మాణ ప్రతిపాదనలపై ఆయన చర్చించారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో ఈ కంపెనీ ఏర్పాటు కానుందని, అధికారులు సహకరించాలని కోరారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్క్ బాపట్ల, రేపల్లె, చీరాలలో ఏర్పాటు కోసం 25 ఎకరాల భూమి కేటాయించాలని అధికారులకు సూచించారు. అలాగే చిరుధాన్యాల ఉత్పత్తి పెంచడం, నాణ్యమైన చిరుధాన్యాల ఎగుమతి చేయడానికి ఔత్సాహికులకు శిక్షణలతో అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తేనే బాపట్ల జిల్లాలో పరిశ్రమలు పెరుగుతాయని ఆయన సూచించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జి.ఎం.మదన్‌మోహన్, ఎల్.డి.ఎం. పి.కృష్ణానాయక్, నాబార్డ్ ఏజీఎం కె.ఆర్.డి.కార్తీక్, ఆర్టీఓ ఏ చంద్రశేఖర రెడ్డి పాల్గొన్నారు.

అకౌంట్ అప్‌డేట్ పేరుతో ఘరానా మోసం

తాడేపల్లి రూరల్: పలు షాపుల యజమానుల ఖాతాల్లోని డబ్బును ఓ మోసకారి మాయం చేసిన సంఘటన సోమవారం ఉండవల్లి నాలుగు రోడ్ల సెంటర్ కూడలిలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. ఉండవల్లి అమరావతి రోడ్డులో నిత్యం రద్దీగా ఉండే నాలుగు షాపులకు ఓ వ్యక్తి వెళ్లి నేను భారత్ పే నుంచి వచ్చానని, తన పేరు దుర్గాఫణికుమార్ ప్రసాద్ అని ఐడీ కార్డు చూపించాడు. భారత్‌పే అకౌంట్ అప్‌డేట్ చేయాలంటూ వారి ఫోన్ తీసుకుని ఆ ఖాతాల్లో ఉన్న నగదును తన అకౌంట్‌కు పంపించుకున్నాడు. వెంటనే ఫోన్ ఇచ్చేసి, అర్ధగంటలో మీ ఫోన్ ఆన్ చేస్తే అప్‌డేట్ అవుతుందని చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. అలా నలుగురు వ్యాపారుల నుంచి రూ.25 వేలు తన ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేసుకుని వెళ్లిపోయాడు. మోసపోయామని గుర్తించిన వ్యాపారులు భారత్ పే సంస్థ ప్రతినిధులకు ఫోన్ చేయగా అతను మా వద్ద ఉద్యోగం మానేసి 15 రోజులు అవుతోందని తెలిపారు. మేము చేయగలిగింది ఏమీ లేదన్నారు. సదరు ఉద్యోగి దగ్గర ఐడీ కార్డును స్వాధీనం చేసుకోకపోవడం వల్లే తాము నమ్మాల్సి వచ్చిందని వ్యాపారస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.